ఉపాధ్యాయులతో డీఈవో సమావేశం

మాట్లాడుతున్న డీఈవో మాధవి

ఓదెల, మే 7: మండల కేంద్రంలోని విద్యావనరుల భవనంలో డీఈవో మాధవి బుధవారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి ఫలితాలు, సమ్మర్ క్యాంపులు, సప్లిమెంటరీ పరీక్షలకు ముందస్తు చర్యలు, వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులకు అందించాల్సిన దుస్తులు, పాఠ్య పుస్తకాలు, అమ్మ ఆదర్శ పాఠశాల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాల పై డీఈవో సమీక్ష జరిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం సమయం వరకు యూనిఫాంలు అందించేలా చూడాలని కోరారు. పదో తరగతి పరీక్షలో ఓదెల మండలం 100శాతం ఉత్తీర్ణత సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులను అభినందించారు. సమావేశంలో ఎంఈవో రమేశ్, హెచ్ఎంలు లక్ష్మి నారాయణ, శ్రీనివాసులు, సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీఓ, ఐఆర్టీ టీచర్ గాయత్రి, ఏపీఎం లతామంగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎంఈవో

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముత్తారం, మే 7: ఇటీవల విడుదలైన గురుకుల ఫలితాల్లో జిల్లెలపల్లి పాఠశాల విద్యార్థులు ఆరుగురు ఉత్తమ మార్కులు సాధించారు. విద్యార్థులు శ్రీనిధి, రిచిత, రిత్విక్, అరుణ్, అభినాష్,కార్తీక్ లను ప్రధానోపాధ్యాయుడు కుల్ల రాజేందర్, ఎంఈవో హరిప్రసాద్ అభినందించారు. పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న సమ్మర్ క్యాంపులను విద్యార్థులు వినియోగించుకోవాలని అన్నారు. ఇక్కడ ఖమ్మంపల్లి ప్రధానోపాధ్యుడు దుసమల్లయ్య, వాలంటీర్ మమత పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సన్మానం

విద్యార్థులను సన్మానిస్తున్న టీచర్లు, నాయకులు

రామగిరి, మే 7: ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణా రెడ్డి బుధవారం సన్మానించారు. ఉత్తమ మార్కులు సాధించిన రిషిత (547), ఎం.ప్రత్యూష (546), మనిశ్విత (525), తేజస్విని (505)లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొట్టె సందీప్, మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, కార్యదర్శి శ్రీధర్, హెచ్ఎం శోభన్‌రావు, లయన్స్ క్లబ్ డైరెక్టర్ మారుతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

పెద్దపల్లి, మే7: జిల్లా ప్రజలకు వైద్యాధికారులు వడదెబ్బపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో అన్న ప్రసన్న కుమారి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, ఫార్మసీ అధికారులతో సమావేశమయ్యారు. ఈ – ఔషధీ వెబ్‌సైట్‌లో ఇండెంట్, స్టాక్ ఎంట్రీ, ఖర్చు వివరాలను ఫార్మసీ అధికారులు నమోదు చేయాలన్నారు. వైద్యాధికారులు వడ దెబ్బ జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కీటక జనిత వ్యాధులు, సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలను తీసుకోవాలని, హైరిస్క్ ఏరియాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్‌సీడీ స్పెషల్ డ్రైవ్‌ను ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రాజ మౌళి, వాణిశ్రీ, శ్రీరాములు, కేవీ సుధాకర్ రెడ్డి, బీ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలు

జూలపల్లి, మే 7 ః పెద్దాపూర్‌లోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షాదుల్ తెలిపారు. ఈ నెల 20 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, ఎంఈసీ విభాగాల్లో 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కళాత్మక విద్యపై ఉచిత శిక్షణ తరగతులు

కోల్‌సిటీ, మే 7: వేసవి కాలంలో చిన్నారులకు కళాత్మక విద్యలో నైపుణ్యం పెంపొందించే ఉద్దేశంతో వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ ఫౌండర్ సురభి శ్రీధర్ తెలిపారు. ఆర్ట్స్, క్రాఫ్ట్స్ డ్రాయింగ్, పెయింటింగ్ తదితర విభాగాలలో 4 నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు శిక్షణ కాలంలో ప్రతిభ చూపిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన పిల్లలు ఈనెల 12లోగా ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో సంప్రదించాలని సూచించారు.వివరాలకు సెల్ నంబర్ 8977748838లో సంప్రదించాలని కోరారు.

సింగరేణిలో అవినీతిపై సమాచారం ఇవ్వండి

గోదావరిఖని, మే 7: సింగరేణి సంస్థలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కొన్ని ఆరాచక శక్తులను ఏరివేశామని, ఇంకాను అవినీతి జరిగితే ఉక్కుపాదంతో అణివేస్తామని తగు సమాచారం అందించాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో సింగరేణి యాజమాన్యం పేర్కొంది. మెడికల్ బోర్డు పక్రియలో ఆన్‌ఫిట్ చేయిస్తామని, బదిలీలు జరిపిస్తామని, కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్, డిప్యూటేషన్, ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ పరీక్షలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సింగరేణి ఉద్యోగిని మంగళవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో సంస్థ ఈ ప్రకటన ను జారీ చేసింది. అమాయకులైన కార్మికులను వంచిస్తున్న ఎవరినైనా సంస్థ ఉపేక్షించబోదని, కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. ఫిర్యాదుదారుల పేర్లను గోప్యంగా ఉంచి వారికి సంస్థ పరంగా రక్షణ కల్పించనున్నట్లు యాజమాన్యం పేర్కొంది.

అల్లూరికి నివాళి

అంతర్గాం, మే 7:పెద్దంపేట రైల్వే గేటు వద్ద స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభను పీవైఎల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. నాయకులు సమ్మెట తిరుపతి, మేరుగు చంద్రయ్య, పైడిపల్లి రమేశ్, నల్ల తీగల రమేశ్, రాజేశం, పవన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు

మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మే7: జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు , రాజీవ్ యువ వికాసంపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు అవసరమైన మౌలిక వస్తువుల కల్పన పనుల ప్రతిపాదనలు అందించాలని ఆదేశించారు. ఓదెల, కాల్వ శ్రీరాంపూర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు.రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, హౌసింగ్ ఈఈ రాజేశ్వర్ రావు, డీఆర్‌డీవో ఎం కాళిందిని, పెద్దపల్లి,మంథని మున్సిపల్ కమిషనర్లు ఆకుల వెంకటేశ్, మనోహర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనుల పురోగతి వివరాలను కలెక్టరేట్‌లో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో మోడల్ స్కూల్స్, గురుకులాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా చేపట్టిన అదనపు తరగతులు, సైన్స్ ల్యాబ్ నిర్మాణం, కాంపౌండ్ వాల్ వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. చిల్డ్రన్ హోమ్ నిర్మాణంలో పురోగతి సరిగ్గా లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ. 1.10 కోట్లతో చేపట్టే ఐటీఐ ఇన్నోవేషన్ పనుల టెండర్లు పూర్తి చేసి 5 నెలల్లో పూర్తి చేయాలన్నారు.సమావేశంలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనితా శింగనాథ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా పట్టణాభివృద్ధి పనులు

ప్రణాళికబద్ధంగా పెద్దపల్లి పట్టణాభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష మున్సిపల్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో పెద్దపల్లి మున్సిపల్ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పట్టణంలో నిర్మించిన రెండు పడుకల గదుల ఇండ్లకు తాగునీరు, విద్యుత్ సరఫరా, సీవరేజి లైన్ తదతర మౌలిక వసతుల పనులు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. ఈ నెల 20 నాటికి లబ్ధిదారులకు ఇండ్లు అందించేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఎక్కడా కూడా అక్రమ లేఔట్ ఉండటానికి వీలు లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ నుంచి తీసుకున్న అనుమతి కంటే అదనంగానిర్మాణాలు చేపడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, ఏఈ సతీష్, టీపీఎస్ వినయ్, విద్యుత్ శాఖ పెద్దపల్లి డీఈ తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు

జిల్లాలో ఎక్కడ కూడా తాగు నీటి ఎద్దడి లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , సంబంధిత అధికారులును ఆదేశించారు. వేసవిలో తాగు నీటి సరఫరాపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. మిషన్ భగీరథ సోర్స్‌గా తాగు నీటి సరఫరా చేయాలన్నారు. అనవసరంగా బోర్లు వేయవద్దని సూచించారు. సమావేశంలో మిషన్ భగీరథ (ఇంట్రా) ఈఈ గంగాధర శ్రీనివాస్, గ్రీడ్ ఈఈ పూర్ణ చందర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల తనిఖీ

కాల్వశ్రీరాంపూర్, మే7: కాల్వశ్రీరాంపూర్, పెద్దరాత్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో కేంద్రాల్లో ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ జగదీశ్వర్ రావు, డీటీ శంకర్, ఆర్ఐ నిహారిక ఉన్నారు.

ముత్తారం, మే 7: ముత్తారం, మచ్చుపేట, పారుపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న వరంగల్–మంచిర్యాల జాతీయ రహదారి సీఎన్‌జీ పనులను పరిశీలించారు. ఇక్కడ ఏడీఏ అంజని, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో సురేశ్, సింగిల్ విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, ఏవో అనూష, సీఈవో దాసరి ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేసేందుకే భూ భారతి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్, మే 7 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతితో రైతులకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్‌లో బుధవారం భూభారతిపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ కొయ శ్రీ హర్షతో కలిసి ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా రికార్డులు, రిజిస్ట్రేషన్లు పూర్తి పారదర్శంగా చేసుకోవచ్చునన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి కోత లేకుండా వడ్లు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కొందరు సీడ్ వ్యాపారులు రైతులను ప్రలోభాలకు గురిచేస్తూ, వారికి అన్యాయం చేస్తున్నారన్నారు. వారిపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గీత కార్మికుల సంక్షేమం, వారి రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య కిట్లను అందిస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కొయ శ్రీహర్ష భూభారతిపై రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు, స్థానిక తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎఏంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు సాయిరి మహేందర్, గోపగాని సారయ్యగౌడ్, అబ్బయ్యగౌడ్, చిలుక సతీష్, బిరుదు కృష్ణ, దన్నాయక్ దామోదర్‌రావు ఉన్నారు.

రామగుండంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జ్యోతినగర్(రామగుండం), మే 7: రామగుండం లోని ఒకటో డివిజన్ ఆబాది రామగుండంలో బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావుతో కలిసి అభివృద్ధి పనుల శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.6లక్షలతో ఆర్వో ప్లాంటు నిర్మాణం, రూ.14లక్షలతో వైకుంఠధామం ప్రహరీ నిర్మాన పనులకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇక్కడ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్, మాజీ కార్పొరేటర్ బొంతల రాజేశ్, తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం తూకంలో మోసం...?

- గోదావరిఖనిలో ఓ డీలర్ చేతివాటం
- నిలదీసిన లబ్ధిదారుడు



లబ్ధిదారుడికి తూకంలో వచ్చిన తేడాలు

కోల్‌సిటీ, మే 7: తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిందో లేదో కొందరు డీలర్లు తమ తెలివితేటలు ప్రదర్శిస్తున్నారు. అసలే సన్నబియ్యం కావడంతో తూకంలో కిలో చొప్పున తరుగు తీస్తూ లబ్ధిదారులను మోసం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో గోదావరిఖని హనుమాన్‌నగర్ పరిధిలోని ఓ రేషన్ దుకాణంలో డీలర్ సన్న బియ్యం పంపిణీ సమయంలో తూకం వేసేటప్పుడు లబ్ధిదారులకు కనబడకుండా, వెనుకాల బాటు ఉంచి మోసానికి పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇది గమనించిన ఓ లబ్ధిదారుడు కాంటాలో బియ్యం తూకం వేయగా అనుమానం వచ్చి వెనుకాల చూస్తే అక్కడ 2 కిలోలు, 4 కిలోల బాట్లు చూసి కంగుతిన్నాడు. ముందుగా తనకు పోయాల్సిన బియ్యం కంటే కిలో తక్కువ పోశాడని, ఇదేమిటని డీలర్‌ను ప్రశ్నించడంతో సమాధానం రాలేదని తెలిపాడు. ఐతేవచ్చే నెల ఎక్కువ పోస్తానని సర్ధిచెప్పే ప్రయత్నం చేయగా, సదరు లబ్ధిదారుడు మరింత ఆగ్రహానికి లోనయ్యాడు. అంతే గాకుండా అక్కడ జరుగుతున్న తతంగం అంతా సదరు వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో బుధవారం సాయంత్రం అంతటా వైరల్‌గా మారింది. ఈ సంఘటనతో ఇదే తరహా మోసం మిగతా షాపులలో కూడా జరుగుతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై రామగుండం తాసీల్దార్‌ను వివరణ కోరగా తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదనీ, బుధవారం ఆ ఏరియా పరిధిలోని రేషన్ దుకాణం వద్ద విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా సివిల్ సప్లై విభాగం అధికారులు సదరు రేషన్ షాపు దుకాణంలో విచారణ జరిపి వెళ్లినట్లు తెలిసింది.

జేఎన్‌టీయూలో సాంకేతిక పండుగ ప్రారంభం

ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్

రామగిరి, మే 7: స్థానిక జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సాంకేతిక పండుగ ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఫెస్ట్‌ను కళాశాల ప్రిన్సిపాల్ బీ విష్ణు వర్ధన్ ముఖ్యతిథిగా హాజరై ప్రారంభించారు. టెక్నికల్ ఫెస్టివల్‌లో భాగంగా కళాశాలకు చెందిన ఆరు బ్రాంచ్‌ల విద్యార్థులు పలు ఆకర్షణీయమైన ప్రాజెక్టులను తయారు చేశారు. దీనికి తోడు ఎంటర్‌టైన్‌మెంట్‌కు నాన్ టెక్నికల్ ఫెస్ట్ కింద పలు ఆటలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని ఇతర కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందం ఉద్యోగులు తిలకించారు. సాయంత్రం తృతీయ సంవత్సరం విద్యార్థుల ఫ్లాష్‌మాబ్ ఎంతగానో అలరించింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్, ప్రొఫెసర్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, లైబ్రరీ ఇన్‌ఛార్జి రమణ, పరిపాలనాధికారి సుమన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి నేత్రదానం

ఓదెల, మే 7: నాంపానిపల్లి కి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు మిట్టపల్లి రాజ గోపాల్ మృతి చెందగా, అతని నేత్రాలను కుటుంబీకులు బుధవారం దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ వారికి కుటుంబ సభ్యులు రిటైర్డ్ ఉపాధ్యా యుడి కళ్లను దానం చేసినట్లు పేర్కొన్నారు. ఇందుకు సదాశయ ఫౌండేషన్ నాయ కులు కుటుంబీకులకు కృతజ్ఞతలు తెలిపారు.

చండీయాగంలో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు

చండీయాగం చేసిన మాజీ మంత్రి కొప్పుల దంపతులు

గోదావరిఖని, మే 7: పట్టణంలోని జయదుర్గా దేవి ఆలయం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీసమేతంగా ఆలయానిన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని మహా చండీయాగం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఇక్కడ రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదంచేయండి

యైటింక్లయిన్‌కాలనీ, మే 7 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉల్లి మొగిలి పిలుపునిచ్చారు. బుధవారం ఓసీపీ–3 ప్రాజెక్టు సీహెచ్‌పీలో సమ్మె పోస్టరును విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సర్కార్ పాత చట్టాలను రద్దు చేసి చట్టబద్ధత లేని నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసి దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతున్నదని విమర్శించారు. నూతన బొగ్గు గనులను ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వమే నడిపేలా చర్యలు తీసుకోవాలని, కోల్ ఇండియా నుండి సింగరేణిని విడదీసే ఆలోచన మానుకోవాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించి, చట్టబద్ధ హక్కులను కల్పించాలని, విద్య, వైద్యం మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్. వెంకన్న, ఎ. భూమయ్య, లక్ష్మీనారాయణ, రాజేష్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు హెల్మెట్లు అందజేసిన ఎమ్మెల్యే

గోదావరిఖని, మే 7: రోడ్డు భద్రతలోభాగంగా రామగుండం ట్రాఫిక్ పోలీసు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రధానచౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌లను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ప్రాణాలను కాపాడుకోవడానికి హెల్మెట్‌ను తప్పరిసరిగా ధరించాలన్నారు. ఇక్కడ ట్రాఫిక్ విభాగం అధికారి జ్యోతి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్, డీసీపీ అడ్మిన్ రాజు, ఏసీపీ మడత రమేశ్, ట్రాఫిక్ ఏసీపీ జానీ నరసింహాలు, సీఐ రాజేశ్వర్ రావు, ఎస్ఐ హరిశేఖర్, సంతోశ్‌కుమార్, రామరాజు, తదితరులు ఉన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

గోదావరిఖని, మే 7: ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం 11ఏ గని వద్ద నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఐక్యవేదిక నాయకులు హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల నారాయణ, నాయకులు తిప్పారపు సారయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, టీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సమ్ము రాజయ్య, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జీ రాములు, టీఎన్‌టీయుసీ రాష్ట్ర నాయకులు ఏడుకొండలు మాట్లాడారు. కార్మికవర్గాన్ని కట్టు బానిసలుగా చేసే నాలుగు లేబర్‌కోడ్‌ల రద్దు కోసం చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సింగరేణిలో విజయంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఇక్కడ ఐక్యవేదిక నాయకులు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ నరేశ్, జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు బీ అశోక్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాతంగి రాయమల్లు, జీడీకె 11ఏ పిట్ సెక్రటరీ హెచ్ఎంఎస్ నాయకులు కిరణ్‌కుమార్, జీఎల్‌బీకేఎస్ డివిజన్ కార్యదర్శి చింతల శేఖర్, టీఎస్‌యూఎస్ నాయకులు కుమారస్వామి, దామోదర్‌రెడ్డి, రవీందర్, బీరయ్య, ఫయాజ్, బేగ్ ఉన్నారు.

సీ-గ్రేడ్ ఆపరేటర్లకు ఇంటర్వ్యూలు

ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, మే 7 : సింగరేణి సంస్థ ఆర్జీ– 2 ఏరియాలోని వకీలుపల్లి గనిలో సీ–గ్రేడ్ ఆపరేటర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బుధవారం ఏజెంట్ నెహ్రూ హు ఆధ్వర్యంలో కంటిన్యూస్ మైనర్ యంత్రానికి ఆపరేటర్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో సీ–గ్రేడ్ ఆపరేటర్ల అర్హత కోసం ఇద్దరు ఉద్యోగులు పాల్గొనగా వారికి వృత్తిపరమైన వివిధ పరీక్షలు నిర్వహించి ఇద్దరిని ఎంపిక చేశారు. ఇక్కడ గని మేనేజర్ రవికిరణ్, ఇంజనీర్ నర్సింహ రావు, డీజీఎం(ప) అనిల్ కుమార్ పాల్గొన్నారు.

పంటపొలాల్లో అగ్ని ప్రమాదం

ముత్తారం, మే 7: పారుపల్లి జీపీలోని మానేరు శివారులో ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యుటా, లేక మరే ఇతర కారణమో తెలియదు గానీ సూమారు రూ. 3 లక్షల ఆస్తి నష్టం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పారుపల్లి శివారులో మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చుట్టు పక్కల ఉన్న రైతులు వచ్చే సరికి మంటలు చాలా దూరం విస్తరించడంతో అదుపుచేయడం కష్టంగా మారింది. ఈ సంఘటనలో మండల కేంద్రానికి చెందిన రాపెల్లి సురేందర్ ఐదు ఎకరాల ఆయిల్ ఫాం తోట, దీనికి సంబంధించి డ్రిప్, మోటర్, వైరు, పైపులు పూర్తిగా కాలిపోయాయని రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. చల్ల సది మూడెకరాలు, వేల్పుల రవి ఎకరం, అనుము లక్ష్మన్ ఎకరం మగ వరి కుప్పలు పూర్తిగా కాలిపోయాయి. పశుగ్రాసం కూడా కాలిపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. సుమారు రూ. 4లక్షల వరకు ఆస్తి నష్టం జరి